నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, సోమవారం 13 జనవరి 2025 YADADRI BHUVANAGIRI

# భువనగిరిలో టెన్షన్..టెన్షన్

## ఉదయం నుంచే గులాబీ నేతల అరెస్టుల పర్వం

రోజంతా ఉద్రిక్త వాతావరణం

- ఆందోళనలు, అరెస్టులతో అట్టుడికిన పట్టణం
- పక్కా ప్లాన్ ప్రకారం బీఆర్ఎస్ ధర్నాలు, నిరసనలు
- పోటీగా నిరసనకు దిగి కాంగ్రెస్ కవ్వించే యత్నం
- రెచ్చగొట్టేలా ఎమ్మెల్యే కుంభం వ్యాఖ్యలు..!
- పోలీసు పహారాలో భువనగిరి పట్టణం
- వాహనాల తనిఖీలు.. ట్రాఫిక్ డైవర్షన్..
- పండుగ పూట ఇబ్బందులు పడిన జనం



ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ ఎదుట మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు

**భువనగిరి పట్టణం రణ క్షేత్రంగా మారింది. ఆందోళనలు, అరెస్టులతో అట్టుడికింది. పోలీసులు పట్టణాన్ని ఆధీనంలోకి తీసుకోవడంతో ఏం జరుగుతుందోననే ఆందోళన రేకెత్తింది. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కాంగ్రెస్ నేత కవ్వింపు చర్యలతో రోజంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే గులాబీ నేతల అరెస్టుల పర్వం కొనసాగింది. పక్కా ప్లాన్ ప్రకారం బీఆర్ఎస్ నేతల ఆందోళనలు, నిరసనలు కొనసాగాయి. మరోవైపు పోలీసుల తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.**

– యాదాద్రి భువనగిరి, జనవరి 12 (నమస్తే తెలంగాణ)

### ఉదయం నుంచే ఎక్కడికక్కడ అరెస్టులు

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నేతల దాడికి నిరసనగా భువనగిరి పట్టణంలోని వినాయక చౌరస్తా వద్ద మహాధర్నాకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు ధర్నా నిర్వహించకుండా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ముందస్తు అరెస్టులు చేసి, పోలీస్ స్టేషన్లకు తరలించారు. పల్లె నుంచి పట్నం వరకు గులాబీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. భువనగిరిలోకి రాకుండా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డిని ఘట్‌కేసర్ వద్ద అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల మోతు భాస్కర్‌రావును అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డిని, వనస్థలిపురంలో భువనగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్‌ను, హైదరాబాద్‌లో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, నల్లగొండలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, యాదగిరిగుట్టలో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. రామన్నపేటలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, బీబీనగర్‌లో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను, భువనగిరిలో



భువనగిరిలో పోలీస్ వాహనం లాక్కెళ్లడంతో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడిని దవాఖానకు తరలిస్తున్న పార్టీ శ్రేణులు



భువనగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు

### రెచ్చగొట్టేలా కుంభం వ్యాఖ్యలు..!

ఓ వైపు ఉద్రిక్త పరిస్థితుల నెలకొనగా.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కాలేజీ మైదానంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ''కాంగ్రెస్, రేవంత్ రెడ్డిపై విమర్శిస్తే యూత్ టెంప్ట్ అవుతారు. దాడులు చేసే ఆస్కారం ఉంటుంది. రేవంత్ రెడ్డి అంటే యూత్‌కు ఎంతో ప్రేమ ఉంటుంది. ఎవరూ ఊరుకోరు. మున్ముందు కూడా ఇట్లనే జరుగతయి'' అంటూ కుంభం వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు ప్రధాన రహదారిపైకి వచ్చి కవ్వింపు చర్యలకు పాల్పడే ప్రయత్నం చేశారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తుండగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు.

### బీఆర్ఎస్ ఆందోళనల పర్వం..

భువనగిరిలో బీఆర్ఎస్ వరుస ఆందోళనల పర్వం కొనసాగింది. బీఆర్ఎస్ శ్రేణులు నలు దిక్కుల నుంచి ఒకే సారిగా మోహరించాయి. జూనియర్ కాలేజీ ముందు ప్రధాన రహదారిపై బైఠాయించాయి. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆందోళనకు దిగారు. వివేకానంద విగ్రహానికి పూలమాల వేసేందుకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. రేవంత్ రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి.. అందరినీ అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఇదే సమయంలో వినాయక చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్ రెడ్డి.. బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ఆందోళనకు దిగారు. ఇదిలా నడుస్తుండగానే ప్రిన్స్ కార్నర్ వద్ద మరో గులాబీ దళం ఆందోళన నిర్వహించింది.



భువనగిరిలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు



బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



మహాధర్నాకు బీఆర్ఎస్ శ్రేణులు రాకుండా భువనగిరిలో అంబేద్కర్ విగ్రహం చుట్టూ పోలీసులు కంచె వేసి అశ్వక దళాలతో పోలీస్ పహారా

### పోలీసుల ఫెయిల్యూర్..!

పోలీసులు ఉదయమే మహాధర్నా ప్రదేశాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడికక్కడ భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. వినాయక చౌరస్తా చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. జూనియర్ కాలేజీ, ప్రిన్స్ కార్నర్ జగదేవ్‌పూర్ చౌరస్తా, బస్టాండ్ తదితర చోట్ల వద్ద బారికేడ్లు పెట్టారు. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేశారు. పట్టణం చుట్టూ చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. వాహనాల్లో వస్తున్న ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పట్టణంలోకి అనుమతించారు. కానీ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి సహా వందలాది బీఆర్ఎస్ కార్యకర్తలు పట్టణంలోకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. తమ ప్లాన్‌ను పక్కాగా అమలు చేశారు. వీరిని అడ్డుకోవడంలో పోలీసులు విఫమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు పోలీసులు అంబేద్కర్ విగ్రహాన్ని అష్టదిగ్బంధనం చేశారు. పండుగ సమయం కావడంతో పోలీసు తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## హామీలు అమలు చేసే వరకూ పోరాటం

- మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్



రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

రామన్నపేట : బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి అప్రజాస్వామికమని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రశ్నించే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్నారని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. భువనగిరిలో నిర్వహించే బీఆర్ఎస్ నిరసనకు వెళ్తున్న ఆయనను రామన్నపేటలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిచేసిన వారిని అరెస్టు చేయకుండా వారికి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. తాటాకు చప్పుళ్లు, అరెస్టులకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడరని చెప్పారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి పోశబోయిన మల్లేశం, యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకటేశం, నాయకులు బద్దుల రమేశ్, ఎండీ ఆమే ర్, ఆవుల నరేందర్, ఆవుల శ్రీధ ర్, మోటె నరేశ్, నల్లసైదులు, రెముడాల వెంకన్న, చింటూ, నరేశ్ ఉన్నారు.

## అక్రమ రెస్టులు అప్రజాస్వామికం : ఎమ్మెల్సీ కోటిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నాగార్జున సాగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టులు చేస్తూ అప్రజాస్వామ్యానికి పాల్పడుతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ హిల్ కాలనీలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి నేపథ్యంలో ఆఫీసును పరిశీలించేందుకు వెళ్తున్న నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. హైడ్రా, మూసీ పరిరక్షణ పేరుతో బీఆర్ఎస్ ఆఫీసుల మీద, పార్టీ శిబిరాల మీద దాడులకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నందికొండ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ హిరేకార్ రమేశ్ జీ, నాయకులు సభావత్ చంద్రమౌళి నాయక్, అబ్దుల్ హలీం, సల్లోజు శేఖరాచారి, షేక్ షరీఫ్, సయ్యద్ మక్సూద్, సైదులు, జిలానీ, అర్జున్, ముత్తయ్య, హాజీ, హజార్ పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు అడిగితే అక్రమ అరెస్టులా?

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని అడిగినందుకు బీఆర్ఎస్ నేతలను అరెస్టులు చేసి గొంతు నొక్కుతున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్‌పల్లిలో ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన కాంగ్రెస్ గుండాల దాడికి నిరసనగా భువనగిరిలో మహాధర్నాకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. హామీల అమలుపై ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందన్నారు. కొంతమంది పోలీసులు అత్యుత్సాహం చూపుతున్నారని, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కొనసాగించిందని గుర్తుచేశారు. ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే వచ్చేది కేసీఆర్ పాలనేనని తెలిపారు. రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ యానాల అశోక్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, దుబ్బాక శ్రీధర్, వాజిద్ పాల్గొన్నారు.


## సీఎం రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుంది

- ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



యాదగిరిగుట్టలో పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరి గుట్ట : బీఆర్ఎస్ పార్టీ అంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భయం పట్టుకున్నదని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ బీఆర్ఎస్ చేస్తున్న శాంతియుత పోరాటాలతో ఆయన వెన్నులో వణుకుపుట్టిందని తెలిపారు. అందుకే పోలీసులతో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. భువనగిరిలో జరిగే ధర్నాకు బయల్దేరుతున్న ఆయనను ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. గృహ నిర్బంధం చేశారు. దీంతో పోలీసులతో ఆయన వాగ్వాదానికి దిగారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురిచేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని, ఇది ఇందిరమ్మ రాజ్యమా.. నిర్బంధాల రాజ్యమా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి నిర్బంధాలు లేవని గుర్తు చేశారు.



బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ బీబీనగర్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు

## శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్



హాలియా : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. అధికారంలో ఉన్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొందరు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. హాలియాలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని పేర్కొన్నారు. కానీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దాడుల సంస్కృతి వచ్చిందని ఆరోపించారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం, ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు.

## ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదు

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్



బీఆర్ఎస్ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. దాడికి నిరసనగా ధర్నాకు పిలుపునిస్తే ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధాలు చేశారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి దాడు లు ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. సీఎం రేవంత్ ఏకంగా దాడులను సైతం ప్రోత్సహిస్తున్నారు. నిన్న దాడికి పాల్పడిన దుండగులను పోలీస్ స్టేషన్‌కు తరలించకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తీసుకెళ్లడంలో ఆంతర్యం ఏంటి?

## దాడులు ప్రోత్సహిస్తే ప్రతి దాడులు తప్పవు

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్లకు సంఘీభావం తెలుపుతున్న మర్రిగూడ మండల బీఆర్ఎస్ నాయకులు

మర్రిగూడ : ప్రతిపక్షాలను అణచివేయడం అప్రజాస్వామికమని, నిర్బంధాలతో బీఆర్ఎస్ పార్టీని నిలువరించలేరని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో తన నివాసంలో హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ఈ తరహా దాడులు ప్రోత్సహిస్తే ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. కూసుకుంట్లకు మద్దతుగా మర్రిగూడ మండలంలోని బీఆర్ఎస్ నేతలు ఆయన నివాసం వద్దకు చేరుకొని మద్దతు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బచ్చు రామకృష్ణ, రామిడి వెంకటరమణారెడ్డి, బాలం నర్సింహ, ఆంబోత్ హరిప్రసాద్ నాయక్ తదితరులు ఉన్నారు.

## ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చేది లేదు

రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు



ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకుడు రవికుమార్

భువనగిరి కలెక్టరేట్, జనవరి 12 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ట్రిపుల్ ఆర్‌కు ఎట్టి పరిస్థితుల్లో తమ భూములు ఇచ్చేది లేదని రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల సంఘం నాయకులు తేల్చి చెప్పారు. పట్టణంలోని రాయగిరి లింగబసవ గార్డెన్స్‌లో భువనగిరి మండలానికి చెందిన ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల రైతులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో భూ నిర్వాసితుల సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి పేరుతో ఎన్నో సార్లు పచ్చని పంట పొలాలను ప్రభుత్వం లాక్కుందన్నారు. ట్రిపుల్ ఆర్ పేరుతో మరోసారి రైతుల భూములను గుంజుకునేందుకు ప్రయత్నిస్తుందని, ప్రభుత్వ నక్క వినయాలకు తగ్గేదిలేదని స్పష్టం చేశారు. బడా నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధుల ప్రయోజనాల కోసమే అలైన్‌మెంట్ మార్చి సన్న, చిన్నకారు రైతుల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. అలైన్‌మెంట్ మార్చే వరకూ కొట్లాడుతామని తెగేసి చెప్పారు. సమావేశంలో ట్రిపుల్ ఆర్ భూ బాధితుల సంఘం నాయకులు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తంగెళ్లపల్లి రవికుమార్, అవిశెట్టి పాండుయాదవ్, పల్లెర్ల యాదగిరి, కోటాల అనిల్‌కుమార్, పసుపునూరి నాగభూషణం, అర్జున్‌రెడ్డి, వైకుంఠం, భీంరెడ్డి, యాదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

## సంక్రాంతి సందడి

### పండుగకు సొంతూళ్లకు వచ్చిన పట్నం ప్రజలు

- రద్దీగా మారిన రహదారులు.. బస్టాండ్లు కిటకిట
- నేడు భోగి పండుగ
- సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు



రామగిరి/నేరేడుచర్ల/సూర్యాపేట టౌన్, జనవరి 12 : సంక్రాంతి సంబురాలను మోసుకొచ్చింది. ఊరూవాడ సందడి తెచ్చింది. పట్టణాలు, వివిధ ప్రాంతాల్లో ఉండే వారు సొంతూళ్లకు రావడంతో పల్లెలన్నీ కొత్త శోభను సంతరిచుకున్నాయి. ఆడబిడ్డలు, కొత్త అల్లుళ్లు, బంధువులతో ఇల్లిల్లూ కళకళలాడుతున్నాయి. మూడు రోజుల పండుగలో సోమవారం భోగి పండుగను నిర్వహించేందుకు అంతా సిద్ధమయ్యారు. ముగ్గులు, గొబ్బెమ్మలతో లోగిళ్లను వర్ణరంజితం చేయనున్నారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, గాలిపటాల ఎగురవేతతో ప్రతి ఇంటా ఆనందోత్సాహాలు వెల్లివిరియనున్నాయి. పండుగ కోసం సొంతూళ్లకు వచ్చే జనంతో ఆదివారం రహదారులు రద్దీగా మారాయి. బస్సులు కిక్కిరిశాయి. బస్టాండ్లు కిటకిటలాడాయి. ఉమ్మడి జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అందరి జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండి సుఖ శాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. ఈ సంక్రాంతి పండుగతో అయినా రేవంత్ పాలనకు కనువిప్పు కలిగి అభివృద్ధికి అడుగులు పడాలని కోరుకుందామని తెలిపారు.